క్లుప్తంగా

న్యూపోర్టు సీఐకు సీపీ అభినందన



న్యూపోర్టు సీఐ ఎర్రన్నాయుడిని అభినందిస్తున్న సీపీ రవిశంకర్

పెదగంట్యాడ: ఇటీవల ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన ప్రమాదాన్ని గుర్తించి, మరింత ఆస్తి నష్టం జరగకుండా విధులు నిర్వర్తించిన న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ ఎర్రన్నాయుడును సీపీ డాక్టర్ ఎ.రవిశంకర్ శనివారం అభినందించారు. అనంతరం ఆయనకు రివార్డు అందజేశారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు



మహిళకు మందులు అందిస్తున్న బోగాది సన్యాసిరావు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం కళావేదిక వద్ద శ్రీ సత్య మెడికల్ ఆధ్వర్యంలో వి.డెంటల్ కేర్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శనివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 200 మందికి పలు రకాల వైద్య పరీక్షలు, ల్యాబ్ టెస్ట్‌లు నిర్వహించారు. వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, విశాఖ జిల్లా కన్జ్యూమర్స్ అఫైర్స్ ఫుడ్ అండ్ సివిల్ సప్లై విజిలెన్స్ కమిటీ మెంబర్ బోగాది సన్యాసిరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన చేతుల మీదుగా రోగులకు ఉచిత మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రాము, పి.సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, కల్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రజకుల సంక్షేమానికి ప్రాధాన్యం



అక్కిరెడ్డిపాలెంలో ధోబీఖానా నిర్మాణాన్ని పరిశీలిస్తున్న లతీష్

అక్కిరెడ్డిపాలెం: రజకుల సంక్షేమానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రాధాన్యమిస్తున్నారని వైఎస్సార్ సీపీ 68వ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ అన్నారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో ప్రారంభమైన ధోబీఖానాల నిర్మాణాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు పరిధిలో రూ.39 లక్షలతో అక్కిరెడ్డిపాలెం, గుడివాడ అప్పన్న కాలనీ, రాంనగర్‌లలో ధోబీఘాట్‌లు నిర్మిస్తున్నామని, త్వరితగతిన వాటిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు వరదాడ వెంకటరమణ, నగర ప్రధాన కార్యదర్శి సంద్రాన నూకరాజు, వార్డు రజక సంఘం నాయకుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత



బీమా సొమ్ము అందిస్తున్న సచివాలయ సిబ్బంది

అగనంపూడి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఫార్మా కంపెనీ ఉద్యోగి నాగ వెంకటేష్ కుటుంబానికి వైఎస్సార్ బీమా సొమ్మును అందించారు. 85వ వార్డు కొండయ్యవలసలో నివాసముంటున్న ఎస్.నాగ వెంకటేష్ ఇటీవల లంకెలపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద మంజూరైన రూ.10 వేలను మృతుడి భార్యకు వార్డు సచివాలయ సిబ్బంది అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పెదిరెడ్ల హరీష్, బి.సత్యనారాయణ, వి.కిషోర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలకు కొత్త రూపు

నాడు

కాలువలు ఛిద్రం కావడంతో ఎక్కడికక్కడే మురుగునీరు నిల్వ ఉండిపోయేది. మురుగు మొత్తం రోడ్లపైకి వచ్చేసేది. దీంతో దుర్వాసన వెదజల్లేది. పాదచారులు, వాహనచోదకులు అవస్థలు పడేవారు. మురుగునీటిలో నుంచే రాకపోకలు సాగించేవారు. దోమలు ఇక్కడే వృద్ధి చెందేవి. రోగాలను వ్యాప్తి చేసేవి. ఈ నేపథ్యంలో జనం వ్యాధులతో సతమతమయ్యేవారు. ఆస్పత్రులకు పరుగులు తీసేవారు.

నేడు

అన్ని ప్రాంతాల్లో మురుగునీటి కాలువలను కొత్తగా నిర్మించారు. దీంతో మురుగునీరు ఎక్కడా నిలిచిపోకుండా సాఫీగా ప్రవహిస్తున్నాయి. దీని కారణంగా దోమల బెడద తగ్గింది.. రోడ్లపైకి వాడుకనీరు రాకపోవడంతో ప్రయాణాలు కూడా సాఫీగా సాగుతున్నాయి.

- సాఫీగా మురుగునీరు ప్రవాహం
- తొలగిన ఇబ్బందులు
- ఊపిరిపీల్చుకున్న ప్రజలు



ఇది కదా అభివృద్ధి

పెదగంట్యాడ: జీవీఎంసీ జోన్–6, పెదగంట్యాడ మండలంలోని అన్ని వార్డుల్లో కాలువలు, గెడ్డల రక్షణ గోడలు నిర్మించారు. గతంలో ఈ కాలువలు ఛిద్రం కావడంతో జనం అవస్థలు పడేవారు. ఇళ్ల ముందే మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన భరించలేకపోయేవారు. తమ ఇబ్బందులను ఎవరికి చెప్పాలో తెలియక సతమతమయ్యేవారు. గెడ్డలకు రక్షణ గోడలు లేకపోవడంతో వర్షాలు పడినపుడు అటుగా రాకపోకలు సాగించేవారు గెడ్డల్లో పడిపోయేవారు. మండలంలోని గాంధీనగర్, హెచ్‌బీ కాలనీ, బర్మా కాలనీ, డెయిరీకాలనీ, రామచంద్రనగర్, రిక్షా కాలనీ తదితర ప్రాంతాలు పెద్ద వర్షం పడితే ముంపునకు గురయ్యేవి. కానీ ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టారు. అందులో 80 శాతం పనులు పూర్తి కాగా మరికొన్ని ప్రాంతాల్లో ఉన్న 20 శాతం పనులు కూడా చకచకా చేస్తున్నారు.

- జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని బాపూజీ కాలనీ, వికాస్‌నగర్ ధోబీఘాట్, బాపూజీ కాలనీ పాఠశాల వద్ద గల శ్మశానం వద్ద గల డ్రైనేజీని రూ.99.23లక్షలతో నిర్మించారు.
- జీవీఎంసీ 76వ వార్డు గాంధీనగర్‌లో అంబికా రెసిడెన్సీ నుంచి గాంధీనగర్ వరకు, శెట్టిబలిజ వీధి నుంచి హెచ్‌బీ కాలనీ వరకు రూ.16.40 లక్షలతో కాలువలు నిర్మించారు.
- జీవీఎంసీ 76వ వార్డు గాంధీనగర్ శివాలయం పక్కన, నడుపూరు ఆర్యవైశ్యుల వీధి, శెట్టిబలిజ వీధిలో రూ.15లక్షలతో కాలువలు నిర్మించారు.
- జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దల్లివానిపాలెంలో రూ.8లక్షలతో సీసీ కాల్వలు నిర్మించారు.
- 70వ వార్డులో తోకాడ నుంచి ఎల్వీ నగర్ వరకు రూ.75 లక్షలతో 270 మీటర్ల పొడవునా కాలువ నిర్మించారు.



70వ వార్డు తోకాడ-ఎల్వీనగర్ సీసీ డ్రైన్



74వ వార్డు దల్లివానిపాలెంలో కొత్తగా నిర్మించిన కాలువ



గాంధీనగర్‌లో కొత్తగా నిర్మించిన కాలువ

వార్డు : 65	వార్డు : 76	వార్డు : 74	వార్డు : 70
నిధులు : 99.23 లక్షలు	నిధులు : 16.4 లక్షలు,15 లక్షలు	నిధులు : రూ.8 లక్షలు	నిధులు : 75 లక్షలు

దోమల బెడద తగ్గింది



కాల్వలు సక్రమంగా లేకపోవడంతో ఇళ్ల ముందే వాడుకనీరు నిలిచిపోయేది. గతంలో ఎప్పుడో నిర్మించిన కాలువల కారణంగా ఇబ్బందులు పడేవాళ్లం. రోజూ దోమలతో అవస్థలు పడేవాళ్లం. ఇప్పుడు కాల్వలు నిర్మించడంతో మురుగునీరు నిల్వ ఉండడం లేదు. దోమల బెడద కూడా లేదు.

–దల్లి అప్పయ్యమ్మ, దల్లివానిపాలెం, 74వ వార్డు

గెడ్డలో పడిపోయేవారు



పెద్ద వర్షం పడితే చాలు గెడ్డ పొంగిపొర్లేది. ఇటుగా రాకపోకలు సాగించేవారు దారి కనపడక అందులో పడిపోయేవారు. గెడ్డ చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొని ఉండేది. కానీ ఇప్పుడు గెడ్డ వద్ద రక్షణ గోడ నిర్మించారు. దీంతో నీరు అందులో నుంచే వెళ్లిపోతోంది. ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారమైంది.

–గంధవరపు తాతారావు, దోబీఘాట్, 65వ వార్డు

30 ఏళ్ల ఇబ్బందులు తొలగాయి



తమ కాలనీ నిర్మించి సుమారు 30 ఏళ్లు అయింది. అప్పట్లో నిర్మించిన కాలువలన్నీ ఛిద్రమయ్యాయి. వర్షాలు పడినపుడు వరదనీరు రోడ్లపైకి, ఆపై ఇళ్లలోకి వచ్చేసేది. అలాగే వాడుక నీరు రోడ్లపై నిలిచిపోయేది. పరిస్థితిని ఎమ్మెల్యే నాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. కొత్తగా కాలువలు నిర్మించారు. ఇబ్బందులు తొలగిపోయాయి.

– కాతా బాలకృష్ణ, అధ్యక్షుడు, గాంధీనగర్ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: జీవీఎంసీ 67వ వార్డులో రూ.32 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.14 లక్షలతో గాజువాక మెయిన్ రోడ్డుకు మరమ్మతులు, రూ.18 లక్షలతో కుంచుమాంబ గుడి వెనుక కాలువ నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోను అభివృద్ధి పనులను చేపట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్ఎండీ గౌస్, నాయకులు పల్లా పెంటారావు, కామనాయుడు, అన్నపూర్ణ, లక్ష్మి, కుమార్, సాహిద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యమే లక్ష్యంగా.. 'ధూం ధాం'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించనున్న ధూంధాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఉక్కు ఎల్ఎంఎం పార్కులో ధూంధాం పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యం కలిగించడం కోసం ఈ కార్యక్రమం చేపట్టామనారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వీధి నాటికలు, పాటల రూపాల్లో ప్రజా చైతన్యం కలిగించి, ఈ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలన్నది ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజానాట్య మండలి జిల్లా నాయకుడు కె.సత్యనారాయణ, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ,అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు,వై.టి.దాస్,రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 1, 2 తేదీల్లో మెగా జాబ్‌మేళా

విశాఖ విద్య/ మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా డిసెంబర్ 1, 2 తేదీల్లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఏపీఎంఎస్ఎంఈడీసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని జాబ్‌మేళా ఏర్పాటు చేశారు. జీవీఎంసీ 59వ వార్డులోని జింక్ హనుమాన్ టెంపుల్ దరి ఎంవీపీ జూనియర్ కాలేజీ(ఆండాలమ్మ కాలేజ్) ఆళ్వార్ పాలిటెక్నిక్, గాజువాక బస్‌డిపో ప్రాంతంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఆటోమొబైల్, రిటైల్, టెక్స్‌టైల్స్, హెల్త్‌కేర్, ఫార్మా, ఇన్సూరెన్స్, ఐటీ, బీపీవో, ఎడ్యుకేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇలా వివిధ రంగాలకు చెందిన 50 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని ఆడారి ఆనంద్ కుమార్ వెల్లడించారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనే నిరుద్యోగ అభ్యర్థులు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. జాబ్‌మేళాకు వచ్చే నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత మధ్యాహ్నభోజన సదుపాయం కూడా ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆసక్తి, అర్హత గల నిరుద్యోగ అభ్యర్థులు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రత్యేకంగా యాప్ రూపొందించారు. దీనిని ప్రతీ ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9000818467, 90009 38467 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

కమనీయం.. శ్రీనివాస కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న అమర్‌నాథ్ దంపతులు

- పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్ దంపతులు
- టీటీడీ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పరిణయ వేడుక

అక్కిరెడ్డిపాలెం: శ్రీనివాస కల్యాణం కనులపండువగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో 68వ వార్డు మింది జెడ్పీ హైస్కూల్ మైదానంలో శనివారం సాయంత్రం ఈ వేడుక నిర్వహించారు. గుడివాడ గురునాథరావు సతీమణి నాగమణి ఆధ్వర్యంలో జరిపించిన కల్యాణ మహోత్సవంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, హిమగౌరి దంపతులు, మంత్రి అమర్‌నాథ్ సోదరి సురేఖ, భరత్ దంపతులు, కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్ దంపతులు, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు గుడివాడ అప్పల రామ్మూర్తి పాల్గొన్నారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడికి మంత్రి అమర్‌నాథ్ పట్టువస్త్రాలు సమర్పించారు. రుత్వికులు శాస్త్రోక్తంగా వేడుక జరిపించారు. రాష్ట్ర ఇన్‌లాండ్ వాటర్‌వేస్ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, కార్పొరేటర్లు కేబుల్ మూర్తి, ఉరుకూటి చందు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి జీలకర్ర నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రొంగలి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప బలంతో విజయాలు సొంతం

సీపీ రవిశంకర్



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న సీపీ రవిశంకర్

ఉక్కునగరం: సంకల్పబలంతో పాటు సాధన ఉంటే విజయాలు సొంతమవుతాయని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యర్ అన్నారు. స్థానిక శివశివానీ పాఠశాల వార్షిక వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పలు అంశాలపై విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థులతో తన అనుభవాలను పంచుకున్నారు. డాక్టర్ తర్వాత ఐపీఎస్ అవ్వాలని అనుకున్నానని, దానిని సాధించానని తెలిపారు. శారీరక దారుఢ్యం పెంపొందించుకోవాలని సూచించారు. చెడు సావాసాలకు దూరంగా ఉంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం

రహదారులపై ప్రయాణించేటప్పుడు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవల రహదారి ప్రమాదాల వల్ల ఎక్కువమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేసిన 'శివస్తుతి' ప్రదర్శన మంత్ర ముగ్ధులను చేసింది. బటర్ ఫ్లై, గోవన్, చార్లీచాప్లిన్, బాంగ్రా, మరాఠి, చిన్నికృష్ణుని స్తుతిస్తూ చేసిన నృత్యాలు అలరించాయి.పల్లెటూళ్లు మన భాగ్య సీమలు రూపకం ఆకట్టుకుంది. పాఠశాల జనరల్ సెక్రటరీ సుదీర్ కుమార్ సంపతి, కరస్పాండెంట్ ఉషా సంపతి, ప్రిన్సిపాల్ కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

అగనంపూడి: మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లని డాక్టర్ జి.సుజాత అన్నారు. మహిళల ఆరోగ్యం, పౌష్టికాహారం అనే అంశంపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. పౌష్టికాహారం లోపం వల్ల రక్తహీనత కలుగుతుందని, అది అనేక రోగాలకు కారణం అవుతుందని తెలిపారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ పాల్గొన్నారు.

ఓటు నమోదును బాధ్యతగా భావించాలి

గాజువాక: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడం బాధ్యతగా భావించాలని గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి అన్నారు. గాజువాకలోని వివిధ కళాశాలల్లో విద్యార్థులకు ఓటు నమోదుపై శనివారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి నుంచి ఓటు నమోదుకు దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో వివిధ విభాగాల అధికారులు, ఆయా కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

భెల్ ఈడీగా జితేందర్

పదోన్నతి పొందిన అధికారికి అభినందనలు



జితేందర్ రెడ్డికి అభినందనలు తెలుపుతున్న గుర్తింపు యూనియన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ ఇన్‌చార్జి జీఎం ఎస్.జితేందర్ రెడ్డి ఈడీగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయనకు ఏఐటీయూసీ యునైటెడ్ ఫ్రంట్ (గుర్తింపు యూనియన్) ప్రతినిధులు అభినందనలు తెలిపారు. పరిపాలనా భవనంలో ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ జీఎంలు గౌరీ శంకర్, ఎం.ఎస్.శ్రీనివాసరావు, ఏజీఎంలు కండపాల్, మండల్, గుర్తింపు యూనియన్ ఉప గౌరవ అధ్యక్షుడు కొల్లి దేముడు, అధ్యక్షుడు బొండ బాబూరావు, ప్రధాన కార్యదర్శి సుభాకర్ సాహు, ప్రతినిధులు పాల్గొన్నారు.

- జితేందర్ రెడ్డిని ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ యూనియన్ ప్రతినిధులు ఆయన చాంబర్‌లో కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉరుకూటి బాబూరావు, జి.టి.పి.ప్రకాష్, వి.ఆనందరావు, కె.విజయ్ కుమార్, ఎస్.జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాకథాన్



వాకథాన్‌లో పాల్గొన్న ప్రత్యేక సామర్థ్యం గల పిల్లలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల వాకథాన్ శనివారం ఉత్సాహంగా సాగింది. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్టీల్‌ప్లాంట్ అరుణోదయ స్పెషల్ స్కూల్ విద్యార్థులు తమ స్నేహితులతో కలిసి 'చలో చలే' – వాక్ విత్ అండ్ స్పెషల్ ఫ్రెండ్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె.మొహంతి, వి స్టీల్ మహిళా సమితి, అరుణోదయ స్పెషల్ స్కూల్ అధ్యక్షురాలితో కలిసి వాకథాన్‌ను ప్రారంభించారు. ముగింపు వేడుకలో స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అరుణోదయ స్పెషల్ స్కూల్ అందిస్తున్న సేవలను కొనియాడారు. డైరెక్టర్ (కమర్షియల్) డి.కె.మొహంతి మాట్లాడుతూ ప్రత్యేక సామర్థ్యం కలిగిన పిల్లలను సాధారణ జీవన స్రవంతిలో చేర్చడానికి ఇటువంటి కార్యక్రమాలు అవసరమన్నారు. వి స్టీల్ మహిళా సమితి ఉపాధ్యక్షురాలు అంజు మొహంతి, మెడికల్ సీజీఎం డాక్టర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



కణితి హైస్కూల్లో అలరించిన విద్యార్థుల విన్యాసాలు



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను వివరిస్తున్న విద్యార్థులు



దేశంలో రాష్ట్రాలు, సంస్కృతులపై ప్రదర్శన



కణితి హైస్కూల్లో ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నియోజకవర్గంలోని పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. గాజువాక హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో భారత రాజ్యాంగ ఔన్నత్యాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, ఉపన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి, ఉపాధ్యాయులు పాండవులు, లీలా కుమారి, భరత్ కుమారి, రమణ, నాగసూర్యుడు, రాజు, జయలక్ష్మి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నడుపూరు హైస్కూల్లో..

పెదగంట్యాడ: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని అమర్త్యసేన్ సాంఘిక శాస్త్ర అధ్యయన వేదిక ఆధ్వర్యంలో పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ స్ఫూర్తిని పెంపొందించేలా ఏకాంగికాలు, నాటికలు, బృందగానాలు ప్రదర్శించారు. సాంఘిక శాస్త్రానికి సంబంధించి చారిత్రక భౌగోళిక అంశాలకు చెందిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భూభ్రమణం, పరిభ్రమణంపై రాణీ రుద్రమదేవి ఏకపాత్రాభినయం అలరించింది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితచరిత్రను నాటిక రూపంలో విద్యార్థులు కళ్లకు కట్టారు. భిన్న సంస్కృతులను ప్రతిబింబించేలా కోలాటంతో ఆకట్టుకున్నారు. జాతీయ, రాష్ట్రీయ చిహ్నాలతో పాటు పార్లమెంటు నూతన భవన సముదాయం చిత్ర పటాలను ప్రదర్శించారు. సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు రచించిన భూమికి సంబంధించిన గేయం ఆలోచింపజేసింది. భారతదేశంలోని చారిత్రక ప్రదేశాల చిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో రాజాన మంగమ్మ, అప్పలరాజు, సరస్వతి, మాధవి, గౌరీ, ఈశ్వరరావు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కణితి హైస్కూల్లో..

కూర్మన్నపాలెం: 87వ వార్డు పరిధి కణితి హైస్కూల్ ఆవరణలో హెచ్ఎం బి.సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు రాజ్యాంగ స్ఫూర్తిని పెంపొందించే లఘు నాటికలు, నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ కలే షాబేగం ముఖ్య అతిథిగా హాజరై, పిల్లల్లో రాజ్యాంగ స్ఫూర్తిని పెంపొందించే విధంగా ప్రసంగించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రకాశరావు మాట్లాడుతూ రాజ్యాంగం ఔన్నత్యం గురించి, ఆనాటి రాజ్యాంగ సభ సభ్యులు చేసిన సేవల గురించి వివరించారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు ప్రభాకరరావు మాట్లాడుతూ రాజ్యాంగ పీఠికలో అంశాలను క్లుప్తంగా వివరించారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అన్నపూర్ణ, ఝాన్సీ, దైవకృప, ధనలక్ష్మి చేతులమీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక ప్రగతికి కార్మికులే కీలకం

కూర్మన్నపాలెం: దేశ ఆర్థిక ప్రగతికి కార్మికులే కీలకమని, అటువంటి శ్రామికులను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముతూ పోవడం సరికాదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మికులను విస్మరించిన ఏ ప్రభుత్వం బాగుపడలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1017వ రోజు, శనివారం సంస్థకు చెందిన డబ్ల్యూఎండీ, యుటిలిటీ, ఏడీఎం, టీపీ, టీటీఐ విభాగ కార్మికులు పాల్గొని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు.